# మారని నోటు



వి. యస్. అవధాని

★

అజ్ఞాని మనుసులోని ఆలోచనలల్లే ఆకాశంలో మేఘాలు ప్రయాణం చేస్తున్నాయి. ఎంతో దిగులు, ఎంతో నిరుత్సాహం—ఇవన్నీ చంద్రాన్ని ఇంటినుంచి తరిమినయి.

అజ్ఞాని కన్నీటిబిందువులల్లే చిన్నచిన్న చినుకులు పడుతున్నయి. రోడ్డుమీద కొంచెం దూరం నడిచినాక చంద్రం జేబులో చెయ్యిపెట్టి చూసుకున్నాడు- వెంటనే దిగులు విచారం భయం- అన్నీ అతన్ని ఒక్కసారిగా ఆవరించినయి.

అది అతనికి మామూలు. ప్రతినెలా అంతే;

ప్రతిరోజూ అంతే; ఆలోచనలు సాగిపోవాలని బలవంతం చేస్తయి ప్రకృతి అతన్ని అరికటుతుంది, తెలిసి మోసపోయే దౌర్భాగ్యం అతన్ని బాధిస్తోంది

ఇంతకూ అతని జేబులో మిగిలింది ఆ ఆఖరి అయిదు రూపాయల నోటు.

ఏదో ఆలోచన
ఏదో ఆవేగం.
ఏదో ఉద్రేకం.

కాని అవన్నీ చంద్రానికేవిధంగా ఉపకరిస్తయి, పైగా బాధపెటతయి. నడచి నడచి సినిమా హాలుదగ్గర ఆగాడు. సినిమాకి వెళ్లాలి.

అంతకుముందు ఏదన్నా తాగాలి అని పొట్ట అంటోంది. ఉన్నదే ఆ నోటు. అది మారిస్తే మళ్లీ నెలరోజులదాకా ఇంట్లో గడవడం ఎట్లా? కాని తన కోరికలు ముందు తీరాలి.

కరువులో అధికమాసం. కాఫీ తాగుతుండగా స్నేహితుడు శర్మ వచ్చి తన ప్రక్కన కూర్చున్నాడు....ఇద్దరూ కాఫీ సేవించినాక శర్మతో ఏదో మాట్లాడుతూ పరధ్యాన్నంగా నోటు టేబుల్‌మీద పెట్టాడు.

'చిల్లర లేదుసార్. రేపు ఇవ్వండి' అన్నాడు అయ్యర్.

★

సినిమాకి పోయి లాభంలేదు. తను సినిమాలో ఏమీ చూడలేదు. దాంట్లో వచ్చే పాత్రలన్నీ ఎంతో హాయిగా ఉన్నట్లుంటయి. అది చూస్తే తనకు కోపం. అసలు ప్రపంచంలో అంత సుఖం హాయి ఎవరికున్నయి గనుక ???

సినిమాకి పోలేదు. పార్కువైపుకి వెళ్లాడు. పార్కులో కూచున్నాడు. పాట వినిపిస్తోంది. అది పాటల్లేగాక తనలోని రక్తపు మూలుగల్లే ఉన్నది. బల్బులు వెలిగినయి.

చలి వేస్తోంది తను పొడుగాటి లాగూ తొడుక్కున్నాడు. నీకు అది అవసరమేనా ?" అంటోంది తనలోని హేతువాదం. కూచుని అదే పనిగా ఆలోచిస్తున్నాడు.

"ఓ మిష్టర్ చంద్రం!"....వెనుకకు తిరిగి చూసాడు. ఆ వూళ్లో తనను ఎరిగీ ఎరగని పెద్ద మనిషి క్రిష్ణమూర్తి. ఆయన తండ్రి అగస్టు కాల్పులలో వీరుడయినాడు. కనుక ఈయనకు

కలక్టరుద్యోగం వచ్చింది. అయిదు నిముషాలు పట్టింది చంద్రానికి తెప్పరిల్లుకొని ఆయనతో మాట్లాడడానికి.

"ఇప్పుడెక్కడ ఉంటున్నారు?" అన్నాడు చంద్రం.

"వైజాగ్‌లో....మీరేంచేస్తున్నారు" అన్నాడాయన. తను ఏం చేస్తున్నాడు....

"....ఆ....నేను ఊరికినే ఉంటున్నాను." ....సరే వస్తాను" అంటూ ఆయన వెళ్ళిపోయినాడు.

ఆయన వెళ్ళిన కొంచెంసేపటికే గట్టిగా గాలి పీల్చుకుంటూ మళ్ళీ ఆలోచనను తవ్వడం మొదలు పెట్టాడు. 'ఆయనకు నువ్వు ఒక రూపాయి బాకీ' అనే సూత్రం బయటికి వచ్చింది.

చినుకులు వెలిసి మేఘాలు తొలిగి వెన్నెల వచ్చి ఆకాశం రక్తంలేని ముఖంలాగా ఉంది. చంద్రం కూర్చున్నచోటినుంచి లేచి గబగబా రోడ్డువెంట నడిచి కృష్ణమూర్తిగారింటికి వెళ్లాడు.

రోడ్డంతా వాణ్ణి వెక్కిరిస్తోంది. 'అందరికీ నువ్వు బాకీ' అంటోంది.

'అందరూ నాకు బాకీ. కనుకనే అడగ్గానే ఇస్తున్నారు' అనుకున్నాడు చంద్రం. కృష్ణమూర్తిది పెద్దమేడ.

'ఇంత పెద్దమేడ ఎట్లా కట్టించుకున్నాడీయన' అన్నది ఆవేశం.

'ఈయన కట్టించలేదు. వాళ్ళ నాన్న కట్టించాడు' అన్నది ఆలోచన.

'వాళ్ళ నాన్న చాలా దరిద్రుడల్లే ఉండేవాడు' అన్నది కోపం.

'అదికాదు. కృష్ణమూర్తికి వాళ్ళ అమ్మ చాలా ఆస్థి తెచ్చింది. దాంతో ఆయన ఈ మేడ కట్టాడు' అన్నది ఆలోచన.

'అదా సంగతి' అన్నది బుద్ధి.

'కృష్ణమూర్తిగారున్నారా?' అన్నాడు చంద్రం.

ఒక నల్లటి అమ్మాయి బయటికి వచ్చి 'భోంచేస్తున్నారు. కూర్చోండి' అని లోపలికి పోయింది.



'మళ్ళీ వద్దాం' అని బయటికి రాబోయి 'ఏమోలే ఈయనతో కాసేపు మాట్లాడదామను కుని అక్కడి ఓ బెంచీమీద కూర్చున్నాడు.

అయిదు నిముషాలలో కృష్ణమూర్తి బయటికి వచ్చాడు.

'చంద్రశేఖరంగారా ?........ఏదో పనిమీద వచ్చినట్లున్నారు ?'

'అబ్బే ఏం పనిలేదు. ఊరికినే....' 'ఇపుడు మీ అన్నయ్య ఏం చేస్తున్నారు ?'

'ఏమో.... తెలియదు'

'చాలా బాగా రాస్తాడు'

'.........'

'ఏం ఏదో ఆలోచిస్తున్నట్లున్నారు?'

'ఏమీ లేదండీ....మీకు నేను ఒక రూపాయి ఇవ్వాలి. ఈ నోటు తీసుకుని చిల్లర ఇవ్వండి.'

'దానికేం లేండి. ఒక రూపాయికూడా బాకీ తీర్చాలా ? అది అప్పుగా నేను మీకు ఇవ్వలేదు.'

'అట్లా కాదులేండి. ఈ సందర్భంలో నా నీతి విలువ ఒక రూపాయి. ఈ రూపాయిని అసహ్యంగా తీసుకుని మీరు నన్ను గురించి ఏవిధంగానైనా అనుకోవచ్చు.'

'నేను ఎట్లాగూ అనుకోను. అట్లా అనుకునే బదులు ఈ రూపాయీ తీసుకోగలను."

'మీరు తీసుకోకపోయినా నాకు ఇవ్వక తప్పదు'.... అంటూ చంద్రం ఆ కాగితం జేబు లోంచి తీసి దానివంక చూడకుండానే మడతమడత గానే ఆయనకు ఇచ్చాడు.

'అబ్బో....ఇంత కాగితానికి చిల్లర ఉందో లేదో' అంటూ ఆయన లోపలికి పోయినాడు.

'ఎంత అవమానం. అయిదు రూపాయిలకే చిల్లర ఉండదా ? పైగా అబ్బో అంటున్నాడే. ఎంత అన్యాయం. ఎంతో కష్టించి సంపాదించిన డబ్బులో అది ఆఖరీ నోటు అని ఆయనకు తెలియదు. ఇదే ఈ భాగ్యవంతులకున్న జబ్బు....' ఇంకా ఏమేమొ అనుకున్నాడు చంద్రం ఇంతలో.

'చిల్లర ఉన్నది, ఇదుగో' అంటూ ఆయన తొమ్మిది పదులు ఇంకా కొన్ని రూపాయలనోట్లు తెచ్చాడు.

'ఏమిటి ఈ అగౌరవం ?? అనుమానం ???' అని చంద్రం అనుకున్నాడు.

'అట్లా చూస్తారేం. మీరు ఇచ్చింది వంద రూపాయలనోటు' అన్నాడు కృష్ణమూర్తి.

'ఆ....'

కాదని అంటే ఈ వ్యాపారంలో 99 రూపాయల నష్టం. తాచ్చారంచేస్తే ఆయన అనుమానిస్తాడు. నాదేనని తీసుకోడానికి ధైర్యం చాలడం లేదు. తనకు తెలీకుండానే కుడిచెయ్యి ముందుకు పోయింది.

డబ్బుతీసుకుని జేబులో పెట్టుకుని ఏదో అనబోతుండగా——

'వస్తానండీ....మా మదర్ కొంచెం సిక్‌గా ఉంది' అంటూ కృష్ణమూర్తి లోపలికి పోయాడు.

చంద్రం రోడ్డుమీదకు వచ్చి హాయిగా గాలి పీల్చాడు.

చలివేస్తున్నా వేడినెత్తురు హాయి అనిపిస్తుంది. మసక మసక వెన్నెల 'నీ తెలివి చూశావా' అంటోంది.'

★

చంద్రం కొంచెం ఉత్సాహంగా కొంచె దిగులుగా ఇంట్లో ప్రవేశించాడు.

విమల నవ్వుతూ ఎదురువచ్చింది. 'సంసారం చాలా కష్టం....గాదూ ?' అన్నది.

అంటే....తనకు అర్ధంగావడంలేదు. రోజూ ఉన్నదానికి విమల....

'కాగితం మార్చుకువచ్చారా ?' అన్నది మళ్ళీ విమల.

'ఏ కాగితం ???'

'మీ జేబులోది'

'అది ఎక్కడిది ???'

'మీదే !!!'

'..........'

'నిన్న మా అన్నయ్య శర్మచేత వంద రూపాయలూ పంపాడు. మీ జేబులో ఆ కాగితం పెట్టబోయేసరికి ఆ అయిదు రూపాయల కాగితం ఉంది. దాన్ని తీసి ఇది పెట్టాను. మీరు అసలు ఈ సిల్కుచొక్కా ఎప్పుడు వేసుకున్నారు....'

'..........'

'సాయంత్రం ఆ సంగతి మీకు చెప్పుదాం అనుకుంటుంటె నామీదా ఈ పిల్లమీదా విసుక్కుని బయటికి పోతిరి.'

'ఆ !....!!!'